క్లుప్తంగా

వివాహ వేడుకకు మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఆహ్వానం


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కుమార్తె వివాహ ఆహ్వానపత్రికను అందజేస్తున్న ముద్దాల అను తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను) మంగళవారం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తన కుమార్తె వివాహపత్రికను అందజేశారు. ఈనెల 7న అను కుమార్తె ముద్దాల ప్రత్యూష, యెనుముల లక్ష్మీ వరుణ్‌తో వివాహం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, స్టేట్ డైరెక్టర్ లింగం రవి చేతుల మీదుగా ఆహ్వాన శుభ పత్రిక అందజేశారు. వారితో వైఎస్సార్‌సీపీ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, ఫణి పాల్గొన్నారు.

చెవిటి, మూగ విద్యార్థులకు వినికిడి యంత్రాల పంపిణీ

కంబాలచెరువు: శారీరక సామర్థ్యం లోపంతో పాటు చెవిటి మూగ, ఇతర అంగవైకల్యంతో బాధపడే పిల్లలకు పాఠ్యాంశాలు బోధిసున్న విద్యాలయాలు, సంస్థలను పర్యవేక్షించినట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. స్థానిక జియాన్ బ్లైండ్ స్కూల్‌ను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 10 మందికి కళ్లజోళ్లు అందించారు. రాజ్యాంగం ప్రకారం విభిన్న ప్రతిభావంతులు కూడా సమాజంలో భాగమని వారి అవసరాలను తగిన విధంగా మెరుగైన మౌలిక సదుపాయాలు వారికి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆదేశాలు జారీ చేసారని దీనిలో భాగంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విభిన్న ప్రతిభావంతులుండే పాఠశాలలను, సంస్థలను సందర్శిస్తున్నట్టు తెలిపారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సంబంధిత ఇతర జ్యుడీషియల్ అధికారులతో కలిసి పర్యటిస్తున్నట్టు చెప్పారు. ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమయ్యే పరికరాలు, ఇతర సామగ్రి అవసరాల నివేదికను హైకోర్టుకు అందించామన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు మిఠాయిలు పంచారు.

సారా విక్రయాలపై విస్తృత దాడులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం రాజమహేంద్రవరంలో విస్తృత దాడులు నిర్వహించినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.వినీష తెలిపారు. రామదాసుపేట ఏరియాలో సారా విక్రయాలపై దాడులు చేసి పాత నేరస్తురాలైన దుప్పాడ లక్ష్మీ అలియాస్ క్వారీ లక్ష్మీని అదుపులోకి తీసుకుని 75 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ జి.నూకరాజు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు అడబాల సతీష్, జి.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రమాదకరం


మోరంపూడి ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర బడ్జెట్‌లో దేశీయ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతం పెంచడానికి చేసిన ప్రతిపాదనలను అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, ఈ ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీమా కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు ఎస్.ఆర్.జే. మాథ్యూస్ డిమాండ్ చేశారు.మోరంపూడిలోని ఎల్ఐసీ రాజమండ్రి డివిజనల్ ఆఫీసు వద్ద మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఏఐఐఈఏ పిలుపు మేరకు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాథ్యూస్ మాట్లాడుతూ నూటికి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వలన బీమా కంపెనీలు పూర్తిగా విదేశ వ్యాపార సంస్థల ఆధీనంలో నడిచే అవకాశం ఉందన్నారు. ఇది భారతదేశంలో పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బంది కలిగిస్తుందన్నారు.దేశంలో 68 ఏళ్లుగా ఎల్ఐసీ భారత ప్రజల జీవితాలకు గొప్ప భరోసాగా నిలిచిందన్నారు. దేశ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి ఎల్ఐసీ ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాయింట్ సెక్రటరీ పి.ఎస్.ఎన్.రాజు, ఉపాధ్యక్షుడు సీహెచ్. సత్యదేవ, జి. శ్రీనివాస్, కోశాధికారి వి. ఈశ్వరరావు, డివిజనల్ నాయకులు ఎ.కె. విశ్వనాథ్, బొక్కా శ్రీనివాస్, డి. శ్రీనివాస్, పి.సాయిబాబా, ఇమ్రాన్ మహిళా నాయకులు ఆర్.శిరీష, విజయ దుర్గ, శ్రీదేవి, ఉమాదేవి పాల్గొన్నారు.

క్రీడల్లోనూ సత్తా చాటుతున్న విద్యార్థులు

- హ్యాండ్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులు
- సౌత్ జోన్ పోటీలకు ఎంపిక
- కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు


మహిళ హ్యాండ్‌బాల్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన ఎస్‌కేవీటీ విద్యార్థినులు



కరాటేలో కాంస్య పతకం సాధించిన పి.విజయ్

ప్రకాశంనగర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించి సత్తాచాటుతున్నారు. ఇటీవల అన్నవరంలో నిర్వహించిన నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థినులు ప్రతిభచూపి తృతీయ స్థానంలో నిలిచారు. మొత్తం 12 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో నగరానికి చెందిన ఎస్‌కేవీటీ కళాశాల జట్టు మూడవ స్థానంలో నిలిచింది. వీరిలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎల్.వైష్ణవి, ఎం.అశ్విని, బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఎస్.పూజలు ఈ నెలలో తమిళనాడులో నిర్వహించనున్న సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు నన్నయ్య విశ్వవిద్యాలయం తరపున ఎంపికయ్యారు. వీరితో పాటు కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల డిగ్రీ విద్యార్థిని ఎస్.జయంతి సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు ప్రభుత్వ కళాశాలకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పలు క్రీడా పోటీల్లో పతకాలు సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకావడంతో పలువురు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కరాటేలో రెండు కాంస్య పతకాలు కైవసం

కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇటీవలే న్యూఢిల్లీలో నిర్వహించిన ఫెడరేషన్ కప్ ప్రీమియర్ లీగ్‌లో సీనియర్స్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.విజయ్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించగా, ఇదే కళాశాలలో బీకామ్ మొదటి సంవత్సరం చదువుతున్న వి.వెంకటకిరణ్మయి క్యాడెట్ విభాగంలో తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది.

కొరవడిన ప్రభుత్వ సహాయం

క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన సహాయ సహకారాలు అందకపోవడంతో క్రీడాకారులు, కోచ్‌లు ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలు క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు ఆటల పోటీలకు సంబంధించిన క్రీడా సామగ్రిని అందజేయడంతో పాటు క్రీడాకారులకు కావలసిన అల్పాహారం, భోజన వసతి వంటి సౌకర్యాలు ప్రభుత్వమే కల్పించేది. గ్రామీణ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు జిల్లాస్థాయిలో నగదు బహుమతులు గతంలో అందించారు. ప్రస్తుత ప్రభుత్వంలో క్రీడాకారులు ఆయా పోటీల్లో ప్రతిభ చూపినప్పటికీ, వారికి అవసరమైన శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం వంటి విషయాల్లో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పలువురు క్రీడా విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగావకాశాలు మెరుగు



ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు క్రీడాల్లో రాణించడంతో వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించిన వారికి మంచి ప్రభుత్వ ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే ఇప్పుడు యువత క్రీడలపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. చదువుతో పాటు ఆటల్లోనూ రాణించేలా చిన్నారులకు శిక్షణ పొందేలా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలి.

– కేవీ స్వామి, కార్యదర్శి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్

తల్లిదండ్రులు రుణం తీర్చుకోలేనిది


పిడింగొయ్యిలో విద్యార్థినులకు విద్యాసామగ్రి అందజేస్తున్న ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని ఆర్ట్స్ కళాశాల ఇంగ్లీషు ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పిడింగొయ్యి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని సుజాత అధ్యక్షతన సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్, ట్రస్టు అధ్యక్షుడు తమ్మా రవి, ట్రస్టు సలహాదారులు యు.శ్రీరామమూర్తి విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులందరూ పాఠాలను శ్రద్ధగా విని ఆకళింపు చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు సరస్వతీదేవి ఆలయంలో పూజ చేయించిన పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందజేశారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోమటి వెంకట్రావు, ముప్పిడి రాంబాబు, గద్దం ప్రభుదాస్, సుబ్బారావు, కోయిల త్రిమూర్తులు, కాకి వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


ప్రభుత్వాసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు: ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమయపాలన ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసారు. ఆసుపత్రిలోని జనరల్ వార్డు, పిల్లల వార్డులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు దిగువ, మధ్య తరగతి ప్రజలు వైద్య సేవలు పొందేందుకు వస్తారని వారికి సత్వరం వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. దీనికి వైద్యాధికారులు, ఇతర అనుబంధ విభాగాల సిబ్బంది సమయ పాలన ఖచ్చితంగా పాటించాలన్నారు. జనరల్ వార్డు మెడిసిన్ విభాగంలో ఉదయం షిఫ్ట్‌లో విధులు నిర్వహించాల్సిన సిబ్బంది గైర్హాజరవడంతో హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం పిల్లల వైద్య సేవల విభాగాన్ని సందర్శించారు. జనరల్ మెడిసిన్ విభాగంలో ఇద్దరు సిబ్బంది గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానంగా మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలోని వైద్యులు సేవలు అందిస్తున్నారని, ఈ క్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇరువురి అనుమతితో సెలవు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పర్యవేక్షణ అధికారిగా సూపరింటెండెంట్ కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యం.లక్ష్మీసూర్య ప్రభ, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల రికార్డుల నిర్వహణపై శ్రద్ధ చూపాలి


తరల్ కార్యక్రమాన్ని వివరిస్తున్న డీఐ బి.దిలీప్‌కుమార్

కంబాలచెరువు: పాఠశాల రికార్డుల సక్రమంగా నిర్వహించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక జాంపేటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నగరంలోని అన్ని పాఠశాలల్లో రోలు, అడ్మిషన్ల వివరాలను ప్రత్యేక బృందాలు తనిఖీ చేస్తున్నాయన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ తరగతి విద్యార్థుల రోలు, హాజరుపై అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి ఆ చిన్నారిని పాఠశాలకు తీసుకువచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో డ్రాప్‌బాక్స్‌లో ఉంచాలన్నారు. 2024, 25 సంవత్సరానికి సంబంధించిన బేస్‌లైన్, మిడ్ లైన్ టెస్టులను అన్ని పాఠశాలల్లో నిర్వహించినట్టు తెలిపారు. విద్యా సంవత్సరం చివరిలో నిర్వహించే ఎండ్ లైన్ పరీక్షకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుని డైరీలో తరల్ కృత్యాల వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని నాగరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

బొమ్మూరు సూర్యమందిరానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి


సూర్యమందిరంలో పూజలు నిర్వహిస్తున్న గంటా రాంబాబు, ఆమని దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలోని సూర్యమందిరంలో రథసప్తమి వేడుకలు, సూర్యనారాయణమూర్తి జయంతిని మంగళవారం వైభవంగా నిర్వహించారు. హుకుంపేటకు చెందిన గంటా నాగేశ్వరరావు, సత్యవతి దంపతుల కుమారుడు గంటా రాంబాబు, ఆమని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, శాంతి కల్యాణం నిర్వహించారు. జ్యోతిర్లింగార్చనతో రథసప్తమి వేడుకలు ముగిసాయి. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో బ్రహ్మశ్రీ కాళ్లకూరి సూరిపండు ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యనారాయణస్వామి దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం ప్రకల్ప సంయోజకులు ఓలేటి సత్యనారాయణ, అధ్యక్షుడు పతివాడ రామరాజు, సోమనవారితోట ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రథసప్తమి పూజలు.. సూర్యనమస్కారాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రథసప్తమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రద్ధ ఇంగ్లీషు మీడియం స్కూల్లో ప్రముఖ యోగా గురువు తీడా రాము విద్యార్థులతో సూర్యనమస్కారాలు వేయించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ ఓరుగంట నరసింహయోగి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

డివిజన్‌కు ఒక ప్రత్యేక అధికారి నియామకం

కమిషనర్ కేతన్‌గార్గ్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టే పనులు, ప్రజలకు అందించే సేవలు విస్తృతం చేసేందుకు, సంక్షేమ ఫలాలు అర్హులకు అందించడం కోసం ప్రతి డివిజన్‌కు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు కమిషనర్ కేతన్‌గార్గ్ ప్రకటించారు. నగరంలో 50 డివిజన్‌కు ప్రత్యేక అధికారులుగా నియమించిన సిబ్బంది, అధికారులతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధి కోసం నగరపాలక సంస్థ రోడ్ల విస్తరణ, కాలువలు నిర్మాణం, పార్కులను అభివృద్ధి, నగరంలో పచ్చదనం పెంచడం కోసం, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందించడం, స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాలు అమలు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర కార్యక్రమాల నిర్వహించడం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలను సక్రమంగా పర్యవేక్షించి, ఇంజనీరింగ్, టౌన్ పా పారిశుద్ధ్య విభాగాలతో సమన్వయంతో చేయడం కోసం 50 డివిజన్లకు నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. ప్రత్యేక అధికారులుగా నియమించిన అధికారులు తమకు కేటాయించిన డివిజన్లలో ప్రత్యేకంగా శానిటేషన్ నిర్వహణను పర్యవేక్షించాలని, శానిటేషన్ వెహికల్స్ సక్రమంగా చెత్తను తీసుకొని వెళ్లేలా చూడాలని, కాలువలపై ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి భవనం నిర్మాణ సమయంలో గ్రీన్ మ్యాట్లలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షించి మొదటి పది ర్యాంకుల్లో స్థానం సంపాదించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనరు ఎస్.వెంకటరమణ, సూపరింటెండింగ్ ఇంజనీరు జి.పాండురంగారావు, సిటీ ప్లానరు కోటయ్య, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ వినూత్న, సెక్రటరీ శైలజావల్లి, మేనేజరు అబ్దుల్ మాలిక్ అస్ఫర్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఏపీ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్
- రాజమహేంద్రవరం చేరిన పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న దుర్గారావుకు స్వాగతం పలుకుతున్న నిరుద్యోగులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిక్కాల దుర్గారావు డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలనే డిమాండ్లతో ఆయన ఏలూరు నుంచి కాకినాడ వరకూ చేపట్టిన పాదయాత్ర మంగళవారం రాజమహేంద్రవరం చేరింది. కొవ్వూరు నుంచి కోటిపల్లి బస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా లాలాచెరువు, రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి చేరుకుంది. మార్గం మధ్యలో నిరుద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పాదయాత్ర సందర్భంగా నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అనేక సమస్యలను తన దృష్టికి తీసుకుని వచ్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి.. నేడు తమ వద్ద డబ్బులు లేవని, ఏమీ చేయలేమని చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. హామీలు నెరవేర్చని కూటమి బలపరిచే అభ్యర్థిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు అనే ఆయుధంతో ఓడించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా కూటమి ప్రభుత్వానికి నిరుద్యోగుల బలాన్ని చూపించి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రకాశంనగర్ : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం చెంచు కాలనీ, సింహాచలం నగర్‌లో పర్యటించిన అక్కినేని వనజ లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి 18వ వార్డు సచివాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పేదలు పట్టణ ప్రాంతంలో సొంత ఇల్లు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికే అధిక ధరల భారంతో ఇబ్బంది పడుతున్న పేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక దుర్భర జీవితం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సారంగధర మెట్ట నుంచి క్వారీ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి.కొండలరావు,సహాయ కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

సమష్టి కృషితో క్యాన్సర్‌ను అరికడదాం


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ధవళేశ్వరం సీఐ గణేష్

ధవళేశ్వరం: సమష్టి కృషితో క్యాన్సర్‌ను అరికడదామని పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రెహ్మాన్ ఖాన్ పిలుపునిచ్చారు. కమ్యూనిటీ పారామెడిక్స్ -ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని ధవళేశ్వరంలో నిర్వహించారు. ధవళేశ్వరం స్టేట్ బ్యాంకు నుంచి మెయిన్ రోడ్డు మీదుగా బస్టాండ్ వరకు మండల అధ్యక్షుడు రెహ్మాన్ ఖాన్ ఆధ్వర్యంలో సత్యం నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు, పీఎంపీ సభ్యులు కలిసి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంలో పీఎంపీలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నేటి యువత మద్యానికి బానిసై జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించాలంటే అవగాహన అవసరమని అన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదం ప్రకారం ఏకమవ్వడం ద్వారా ఏకీకృతం కావాలన్నారు. క్యాన్సర్ కారకాల నుంచి సంరక్షణపై అందరూ దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం అందించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను అందరూ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స అందిస్తే రోగి తప్పకుండా కోలుకుంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు ప్రసాద్ బాబు, బేబీ సరోజిని, వి శైలజ, ఎస్ లక్ష్మణరావు, కోల లక్ష్మీనారాయణ, ఎమ్ బాపూజీ, గట్టి శ్రీనివాస్, కోట ప్రసాద్, కె రామలింగేశ్వరరావు, నూకరాజు, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ప్రకాశం నగర్ : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జవహర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా వాకర్స్‌కు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ మండవ సుమంత్ ముఖ్య అతిథిగా హాజరై వైద్య పరీక్షలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి పది మందిలో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఈ వ్యాధి బారినపడకుండా పలు జాగ్రత్తలు తీసుకుని తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వాకర్స్ డాక్టర్ మండవ సమంత్‌ను మోమెంటోతో ఘనంగా సత్కరించారు.

చర్చలు లేకుండా ముగిసిన సర్వసభ్య సమావేశం

కడియం: ఎన్నికల కోడ్ కారణంగా కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం మంగళవారం ఎలాంటి చర్చ లేకుండా ముగించారు. ఎంపీడీవో కె.రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి చర్చలు చేయకుండానే ఈ సమావేశాన్ని వాయిదా వేశారు.ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పంతం గణపతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.